సాక్షి నిజామాబాద్

గురువారం । 28 । నవంబర్ । 2024



లస్కర్ చుట్టూ దందా!

ఎస్సారెస్పీలో లస్కర్ పోస్టుల భర్తీ పేరు చెప్పి కొందరు దళారులు నిరుద్యోగులను మోసం చేస్తున్నారు.

- 8లో ▸



గేదెలకు పచ్చగడ్డితో మేలు

పచ్చగడ్డితో పశువుల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో మాజిద్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /10.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

క్రమశిక్షణతో మెలగాలి



డిచ్‌పల్లి : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని డీఈవో అశోక్ సూచించారు. డిచ్‌పల్లిలోని మానవత సదన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. వంట గది, స్టాక్ రూమ్ పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పిల్లల రికార్డ్స్, హెల్త్ రికార్డ్స్ పరిశీలించారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పిల్లలపై ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సదన్ లైజనింగ్ అధికారి సుధాకర్, కేర్ టేకర్ అందే రమేష్, సంధ్యారాణి, మంజుల, సంధ్య, గంగమణి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శిస్తే ఖబడ్దార్

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



నిజామాబాద్ సిటీ : పదేళ్ల బీఆర్ఎస్ పాలన రాక్షస పాలనను తలపిస్తే 11 నెలల కాంగ్రెస్ పాలన ప్ర జాపాలనగా మన్ననలు పొందుతోందని డీసీసీ అ ధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఖబడ్దార్ అని హెచ్చరించా రు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. కేసీఆర్ దీక్ష తో తెలంగాణ రాలేదని, విద్యార్థుల ఆత్మ బలిదానాలను చూసి చలించిన సోనియా గాంధీ ప్రత్యేక రా ష్ట్రాన్ని ఇచ్చారని గుర్తుచేశారు. అది దీక్ష దివస్‌కాదని దొంగ దీక్ష అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్ర మ కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ నేతలు అవా స్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అమాయకులపై, తనను ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించి వేధించారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులను ఏ విధంగా వేధించారో బహిరంగ చ ర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ కవి త రాజకీయాల్లోకి రీ ఎంట్రీతో కాంగ్రెస్‌కేమీ ఫరక్ పడదన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజిరెడ్డి, జావేద్ అక్రం, నరేందర్ గౌడ్, వేణురాజు, సుభాష్ పాల్గొన్నారు.

ప్రధానిని సన్మానించిన ఎమ్మెల్యే ధన్‌పాల్



సుభాష్‌నగర్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ ప్రజాప్రతినిధుల బృందం బుధవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రధాని మోదీని సత్కరించారు. తెలంగాణలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఎమ్మెల్యేలు, ఎంపీలకు మోదీ దిశానిర్దేశం చేసినట్లు ఎమ్మెల్యే ధన్‌పాల్ తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



నిజామాబాద్ అర్బన్ : బాల్య వివాహాలను అరికట్టాలని సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. బుధవారం వినాయక్‌నగర్‌లోని గురుకుల కళాశాలలో సాధన సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహ విముక్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లి చేస్తే అమ్మాయిలు మానసికంగా కుంగిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మకుమారి, జిల్లా శిశు సంరక్షణ అధికారి చైతన్య కులకర్ణి, సాధన సంస్థ కో ఆర్డినేటర్ దగ్గుల మధుసూదన్ పాల్గొన్నారు.

అన్నం.. అధ్వానం

- గురుకులాల్లో నాసిరకం సరుకులతో వంటలు
- ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనంలోనూ అదే పరిస్థితి
- అస్వస్థతకు గురవుతున్న విద్యార్థులు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



జక్రాన్‌పల్లి కేజీబీవీలో అన్నం పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు (ఫైల్)

నిజామాబాద్ అర్బన్ : నాణ్యతలేని సరుకులతో చేసిన భోజనం తిని విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఉడికి ఉడకని అన్నం, నీళ్ల చారుతో చేసిన కూరలు తినలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కొమురంభీ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలో శైలజ అనే విద్యార్థి బడిలో భోజనం తిని అస్వస్థతకు గురైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. జిల్లాలో కూడా భోజనం వికటించి గతంలో చాలా సార్లు విద్యార్థులు ఆస్పత్రుల పాలయ్యారు. దీంతో వసతి గృహాలు, గురుకులాల్లో ఉంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని వార్డెన్లు

జిల్లాలోని వార్డెన్లు సంక్షేమ వసతి గృహాలను పట్టించుకోవడం లేదు. నెలకు రెండు మూడు సార్లు మాత్రమే హాస్టళ్లకు వెళ్తున్నారు. వంట చేసే వారికి అన్ని అప్పగిస్తున్నారు. దీంతో కొందరు డబ్బులు మిగుల్చుకోడానికి నాసిరకం కూరగాయలు, సరుకులు తెచ్చి విద్యార్థులకు వండి పెడుతున్నారు. వీటిని కొన్ని రోజులపాటు నిల్వ ఉంచుతున్నారు. బియ్యం కూడా పురుగులు పడుతుండటంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు.

నిబంధనలు గాలికి..

గురుకులాల్లో కూరగాయలు, సరుకులు సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తారు. వీటిని దక్కించుకోవడానికి చాలా మంది పోటీ పడతారు. తక్కువ కొటేషన్ ఇచ్చిన వారికి టెండర్లను కేటాయిస్తున్నారు. అయితే టెండర్ దక్కించుకున్న వారు టెండర్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం సరుకులు కొనడం లేదు. తక్కువ నాణ్యత, తక్కువ రేటుకు వచ్చే కూరగాయలు, సరుకులు కొంటున్నారు. దీంతో వాటితో వండిన ఆహారం తిని విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. అంతేగాకుండా వంట గదుల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉంటుంది. జిల్లాలో 1,196 ప్రభుత్వ పాఠశాలల్లో 1.04 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. మధ్యాహ్న భోజనం కోసం వినియోగిస్తున్న బియ్యం నాసిరకంగా ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బియ్యంలో తెల్లపురుగులు, లక్కపురుగులు, మట్టి రాళ్లు ఉండడంతో భోజనం తిన్న విద్యార్థులు వాంతులు చేసుకుంటున్నారు.

జిల్లాలో గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు

విభాగం	పాఠశాలలు	విద్యార్థులు
ఎస్సీ	11	6,320
బీసీ	13	8,760
ఎస్టీ	05	2,100
మైనారిటీ	17	8,352
ఆదర్శ పాఠశాలలు	09	1,110
కేజీబీవీలు	25	6,180
సంక్షేమ హాస్టళ్లలో..		
ఎస్సీ	42	3,552
బీసీ	33	2,800
ఎస్టీ	08	1,480

తనిఖీలకు ఆదేశాలు

రాష్ట్రవ్యాప్తంగా భోజనం వికటించిన ఘటనలు చోటు చేసుకుంటుండటంతో గురుకులాలు, హాస్టళ్లను పరిశీలించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు మూడు రోజుల నుంచి నిత్యం గురుకులాలు, కేజీబీవీల్లో తనిఖీలు చేపడుతున్నారు. వంటగదులు అపరిశుభ్రంగా ఉండటం, పరిసరాలు బాగా లేకపోవడాన్ని అధికారులు తనిఖీల్లో గుర్తిస్తున్నారు.



పాత వర్ని బాలికల గురుకుల పాఠశాలలో ఆలుగడ్డలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

కుళ్లిన గుడ్లు.. పాడైన ఆలుగడ్డలు

వర్ని : వర్ని మండలం కోటయ్య క్యాంపులోని కేజీబీవీ, బాలికల గురుకుల పాఠశాలను బుధవారం అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. హాస్టల్‌లో కుళ్లిన గుడ్లు, చెడిపోయిన ఆలుగడ్డలు, స్టోర్‌రూమ్‌లో ఎలుకలు కనిపించడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వార్డెన్లకు సూచించారు. ఎక్కడైన లోపాలు చోటు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్టల్‌లో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని విద్యార్థులకు సూచించారు.

కేజీబీవీలో రికార్డులు సరిగా లేకపోవడం, వంటగది అపరిశుభ్రంగా ఉండటం, గుడ్లు వాసన రావడంతో ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ సాయిలు, ఎంఈవో దుర్కి సాయిలు, ఎంపీవో మారుతి ఉన్నారు.

ప్రత్యేక ఏజెన్సీలకు కేటాయించాలి



మధ్యాహ్న భోజనం నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారింది. పూర్తి సమయం బోధనకు వినియోగించుకోలేకపోతున్నాం. మధ్యాహ్న భోజన పథకానికి ప్రత్యేక ఏజెన్సీలకు కేటాయించాలి. ఏజెన్సీలో ప్రత్యేకంగా వండి సరఫరా చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలి.

– అంకం నరేశ్, పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు

నగరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్



వంతెనను ఢీకొన్న కారు: తండ్రీకుమారుల మృతి





శివరాజ్ దేశాయ్, రాజశేఖర్ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్)/జోగిపేట : వంతెనను ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన సంగారెడ్డి–నాందేడ్ అకోలా రహదారిపై అల్లాదుర్గంలో బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తండ్రీకుమారులు శివరాజ్ దేశాయ్(71), రాజశేఖర్ దేశాయ్(49) మృతి చెందారు. వివరాలు.. కోటగిరి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన రాజశేఖర్ తన తండ్రి శివరాజ్, తల్లి లక్ష్మిబాయి, భార్య అరుణ, కూతురు అనన్యతో కలిసి హైదరాబాద్ నుంచి బోధన్ వస్తున్నాడు. మార్గమధ్యలో అల్లాదుర్గం హైవేపై అతివేగంతో ఉన్న వారి కారు అదుపు తప్పి వంతెనను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజశేఖర్, శివరాజ్ మృతి చెందారు. కారులోని మిగతా ముగ్గురు గాయపడగా వారిని హైదరాబాద్ తరలించారు. శివరాజ్, రాజశేఖర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోచారం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని మృతదేహాల వద్ద నివాళులు అర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బస్వాపూర్‌లో విషాదఛాయలు

రుద్రూర్ : కోటగిరి మాజీ జెడ్పీటీసీ, సీనియర్ నాయకుడు శివరాజ్ దేశాయ్ రోడ్డు ప్రమాదంలో మరణించారనే వార్త తెలియడంతో ఆయన ఆయన స్వగ్రామం బస్వాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. దేశాయ్ బోధన్ సీడీసీ చైర్మన్‌గా, కోటగిరి ఉమ్మడి మండల జెడ్పీటీసీగా, బస్వాపూర్ సర్పంచ్‌గా సేవలు అందించారు. టీడీపీ హయాంలో మండల అధ్యక్షుడిగా పని చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో అహర్నిషలు కృషి చేశారు.

పరిధి దాటి వైద్యం

- పుట్టగొడుగుల్లా ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లు
- ఎంబీబీఎస్ డాక్టర్ల మాదిరిగా వైద్యం అందిస్తున్న పలువురు
- ఇష్టారీతిగా యాంటిబయాటిక్స్ వినియోగం
- మెడికల్ కౌన్సిల్ తనిఖీలతో వెలుగులోకి..



నిజామాబాద్ నాగారం : జిల్లాలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తున్నారు. ప్రథమ చికిత్సకే పరిమితం కావాల్సిన వారు ఎంబీబీఎస్ వైద్యుల మాదిరి సేవలు అందిస్తూ.. ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. సెలైన్లు పెట్టడానికి, ఇంజెక్షన్లు ఇవ్వడానికి అర్హత లేకున్నా.. చిన్నపాటి రోగం తమ దగ్గరికి వచ్చిన వారికి ఇంజెక్షన్లు ఇస్తున్నారు. ఇష్టారీతిగా యాంటి బయాటిక్‌లు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దీంతో పాటు అత్యాశతో రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తూ కమీషన్‌లు తీసుకుంటున్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలపై ప్రభుత్వానికి, మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నారు. మంగళవారం జిల్లాలోని పలుచోట్ల తనిఖీలు చేయడంతో వారిలో వణుకు మొదలైంది.

ఫీజులతో పాటు కమీషన్లు

జిల్లాలో సుమారు మూడు వేలకు పైగా ఆర్‌ఎంపీ, పీఎంపీలున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు రోగాల బారిన పడితే వీరినే ఆశ్రయిస్తున్నారు. ఇదే ఆసరాగా చేసుకొని చిన్నపాటి జ్వరంతో వచ్చిన వారికి సైతం వీరు ఇంజెక్షన్ ఇచ్చి రూ.100 తీసుకుంటున్నారు. అవసరం లేకున్నా సెలైన్ పెట్టి రూ.వేయి వరకు వసూలు చేస్తున్నారు. మాములు మందులతో తగ్గిపోయే రోగాలకు సైతం ఎక్కువ డోస్ ఉన్న యాంటిబయాటిక్స్ ఇస్తున్నారు. అయినా రోగం తగ్గకపోతే ఫలనా ఆస్పత్రికి వెళ్లాలని చెప్పి ఆ ఆస్పత్రి నుంచి కమీషన్ తీసుకుంటున్నారు.

15 మంది నకిలీ వైద్యులు

మెడికల్ కౌన్సిల్ సభ్యులు మంగళవారం జిల్లాలో తనిఖీలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 30 క్లినిక్‌లపై దాడులు చేయగా 15మంది నకిలీ వైద్యులను గుర్తించారు. కనీస విద్యార్హత లేకుండా ఆధునిక వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. వీరి క్లినిక్‌లకు అనుబంధంగా ఉన్న మెడికల్ స్టోర్స్‌లో సైతం క్వాలిఫైడ్ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇస్తున్నట్లు తేలింది. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వీరిపై ఎన్‌ఎంసీ చట్టం 34, 54 ప్రకారం కేసులు నమోదు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ చట్టం ప్రకారం ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

నకిలీ వైద్యులతో ముప్పు

నకిలీ వైద్యులతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఉంది. ఎలాంటి విద్యార్హత లేని వారు వైద్యం చేస్తున్నారు. ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాలో నకిలీ వైద్యుల తో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నాం.

– శ్రీనివాస్, తెలంగాణ వైద్య మండలి వైస్ చైర్మన్

మాకు సంబంధం లేదు

ఆర్‌ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లలో తనిఖీలతో మాకు ఎలాంటి సంబంధం లేదు. మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదులు వెళ్లడంతోనే తనిఖీలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రథమ చికిత్స చేయాల్సిన వారు అర్హతకు మించి వైద్యం చేయడం సరికాదు.

– అజ్జ శ్రీనివాస్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు

ఉపాధి హామీలో అవకతవకలు

- నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో పనులు
- పనికి రాని వారికి, మరణించిన వ్యక్తులకు కూలి చెల్లింపు
- మట్టి రోడ్ల పనుల్లో తేడాలు
- ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర
- సామాజిక తనిఖీల్లో వెలుగుచూస్తున్న అక్రమాలు



డొంకేశ్వర్(ఆర్మూర్) : ఉపాధిహామీ పథకంలో అవినీతి ఆగడం లేదు. పథకం పక్కదారి పట్టకుండా ప్రభుత్వాలు ఈ వ్యవస్థను ఎంత పటిష్టం చేసినప్పటికీ లొసగులు వెతికి మరీ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఏడాదికోసారి సామాజిక తనిఖీ జరుగుతుందని తెలిసీ కూడా కొందరు ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారు. ఇటీవల జరిగిన డొంకేశ్వర్, నందిపేట్ మండలాల సామాజిక తనిఖీల్లో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో పాటు పంచాయతీ కార్యదర్శుల బాగోతం బట్టబయలైంది. విస్తుపోయేలా అవకతవకలు వెలుగుచూశాయి. కానీ ఉన్నతాధికారులు కఠిన చర్యలకు వెనకడుగు వేశారు. కేవలం హెచ్చరికలు చేసి స్వల్ప జరిమానాలు విధించి సరిపెట్టారు. ఎప్పటిలాగే చిన్నపాటి చర్యలతో తప్పించుకున్నామని సదరు ఉద్యోగులు ధీమాగా ఉన్నారు. ఒక్క ఉమ్మడి నందిపేట్ మండలంలోనే ఇన్ని అవకతవకలు జరిగితే, జిల్లాలోని మిగతా మండలాల్లో ఎన్ని అక్రమాలు జరిగి ఉంటాయో చెప్పనక్కర్లేదు.

జిల్లాలో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ఉమ్మడి మండలాలు 27, వీటి పరిధిలో 530 గ్రామ పంచాయతీలున్నాయి. జాబ్ కార్డులు 2,56,777 ఉండగా ఇందులో 4,86,073మంది కూలీలు ఉన్నారు. పనులకు సరాసరిగా లక్షమంది మంది వరకు హాజరవుతున్నారు. వీరికి పని కల్పించే క్రమంలో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు అడ్డదారులు తొక్కుతున్నారు. కూలీల పేరుతో అక్రమంగా డబ్బులను కాజేస్తున్నారు. సామాజిక తనిఖీల్లో బయటపడుతున్న అవకతవకలు ఒక్కశాతమేనన్న ఆరోపణలు లేకపోలేవు. ఎందుకంటే తనిఖీలకు ముందే అక్రమాలు బయటపకుండా జాగ్రత్తలు తీసుకుంటారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఇటు నర్సరీల నిర్వహణ, మొక్కలు నాటే కార్యక్రమంలో సైతం నిధులు పక్కదారి పట్టించిన ఘటనలున్నాయి. మొత్తానికి ఉపాధిహామీ పథకం ద్వారా పనులకు వచ్చే కూలీల కంటే పర్యవేక్షణ చేసే ఉద్యోగులే ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారనే వాదనలు సైతం ఉన్నాయి.

- ఉమ్మడి నందిపేట్ మండల సామాజిక తనిఖీ ఇటీవల జరిగింది. 33 గ్రామ పంచాయతీల్లో తనిఖీ బృందం పర్యటించింది. ఓ గ్రామంలో ఇద్దరు కూలీలు పనికి రాకున్నా ఫీల్డ్ అసిస్టెంట్ వారికి కూలి చెల్లించినట్లు తేలింది. మరో గ్రామంలో చనిపోయిన వ్యక్తికి పేమెంట్ చేసినట్లు గుర్తించారు. చాలా గ్రామాల్లో వేసిన మట్టి రోడ్ల పనుల్లో తేడాలు కనిపించాయి. మొత్తం 33 గ్రామ పంచాయతీలకు 27కు పైగా జీపీల్లో అవకతవకలను గుర్తించారు. 12 గ్రామ పంచాయతీలు, 21మంది పంచాయతీ కార్యదర్శులు, ముగ్గురు టీఏల నుంచి డబ్బుల రికవరీకి అధికారులు ఆదేశించారు.

చర్యలు తీసుకుంటాం

ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన ఎంతటివారైన సరే ఉపేక్షించేది లేదు. సామాజిక తనిఖీలు జరిగిన సమయంలో బయటపడిన అవినీతిని బట్టి ఉద్యోగులపై చర్యలుంటాయి. అక్రమాలు తారాస్థాయిలో ఉంటే సస్పెండ్‌తో పాటు నిధుల రికవరీ చేయడానికి అధికారం ఉంది.

– సాయాగౌడ్, డీఆర్‌డీవో

కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి పెద్దపీట

- ఉమ్మడి జిల్లాలో రూ.85 కోట్లకుపైనే బోనస్ జమ
- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుందని, అందులో భాగంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు క్వింటాలుకు రూ.500 బోనస్ జమ చేస్తుందని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సన్న రకాలకు రూ.500 బోనస్ జమ చేస్తున్న సందర్భంగా బుధవారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో రూ.85 కోట్లకుపైగా బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. రుణమాఫీతోపాటు బోనస్ డబ్బులు జమ చేస్తుండటంపై రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, రైతు భరోసా, కూరగాయల సాగుకు ప్రోత్సాహం, చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, బ్యాంకు వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ము నిపల్లి సాయిరెడ్డి, డైరెక్టర్ లింగయ్య, సొసైటీ చైర్మ న్లు శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, రామకృష్ణ, గోవర్ధన్ రెడ్డి, నాగేశ్వర్‌రావు, హన్మంతు, సహకార సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, నాయకులు

క్లుప్తంగా

జాతీయస్థాయికి ఎంపిక



వేల్పూర్‌: మండలంలోని పచ్చలనడ్కుడ హైస్కూల్‌ విద్యార్థినులు జి.వాగ్దేవి, కే.మధుశ్రీ జాతీయస్థాయి ఉషు పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జైడి రమేశ్‌ బుధవారం తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో ముప్కాల్‌ ఇండోర్‌ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఇద్దరు ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించారన్నారు. పంజాబ్‌లో డిసెంబరు 1 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారిణులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

క్షత్రియ ఇంజినీరింగ్‌ కళాశాలకు న్యాక్‌ గుర్తింపు



పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మండలం చేపూర్‌ క్షత్రియ ఇంజినీరింగ్‌ కళాశాలకు నేషనల్‌ అసెస్‌మెంట్‌ అండ్‌ అక్రిడిటేషన్‌ కౌన్సిల్‌ నుంచి 'ఏ' గ్రేడ్‌ గుర్తింపు లభించినట్లు క్షత్రియ విద్యాసంస్థల చైర్మన్‌ అల్జాపూర్‌ శ్రీనివాస్‌ బుధవారం తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్‌ ఆర్‌కే పాండే మార్గదర్శకత్వంలో అధ్యాపకులు, సిబ్బంది, పరిపాలన బృందం సమష్టి కృషితో కళాశాలకు న్యాక్‌ గుర్తింపు వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో విద్యా సంస్థల వైస్‌ చైర్మన్‌ అల్జాపూర్‌ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వధార్‌ హోమ్‌ నుంచి మహిళ పరారీ

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్‌ పరిధిలో ఉన్న స్వధార్‌ హోమ్‌ నుంచి ఓ మహిళ పరారైనట్లు ఎస్సై మహేశ్‌ మంగళవారం తెలిపారు. గత ఏడు నెలల క్రితం రుద్రూర్‌ గ్రామానికి చెందిన ఫర్హానా (35)ను షెల్టర్‌ నిమిత్తం సఖి సెంటర్‌ వారు స్వధార్‌ హోమ్‌కి పంపించారన్నారు. ఈనెల 26న రాత్రి 10:30 గంటలకి స్వధార్‌ హోమ్‌లో భోజనం చేసి పడుకున్న ఫర్హానా మధ్యరాత్రి వేళలో బయటికి వెళ్లిపోయిందన్నారు. స్వధార్‌ హోమ్‌ కౌన్సిలర్‌ వంతకాల అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్‌: క్రిస్మస్‌ పండుగ సందర్భంగా సామాజిక, విద్య, వైద్యం, సాహిత్యం, కళలు, క్రీడా రంగాల్లో ఉత్తమ సేవ అందించిన, ప్రతిభ కనబర్చిన 30 ఏళ్లు పైబడిన క్రైస్తవ వ్యక్తులు, సంస్థలను ఎంపిక చేసి ప్రభుత్వపరంగా సత్కరించనున్నట్లు అదనపు కలెక్టర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ కార్యాలయం 222 నంబర్‌ గదిలో తమ నామినేషన్లను డిసెంబర్‌ 5లోగా అందజేయాలని సూచించారు. లేదా తెలంగాణ క్రైస్తవ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ సైట్‌లో ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేయవచ్చన్నారు.

'లస్కర్‌' చుట్టూ దందా!

- ఎస్సారెస్పీ డివిజన్‌–1 లో ఒక్క లస్కర్‌ పోస్టు
- ఎస్సారెస్పీ డివిజన్‌–1లో ఉన్నది ఒక్క పోస్టు
- భర్తీ చేసేది ఒక్క పోస్టు అయినా.. వందల పోస్టుల భర్తీ అంటూ ప్రచారం
- మధ్యవర్తుల ఉచ్చులో చిక్కుకుంటున్న నిరుద్యోగులు



శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ కార్యాలయం

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ జీవీసీ(గోదావరి వ్యాలీ సర్కిల్‌)–1 పరిధిలో మొత్తం 7 లస్కర్‌ పోస్టులను అవుట్‌ సోర్సింగ్‌ ప్రాతిపదికన నియమించేందుకు ప్రభుత్వం అనుమతించింది. అందులో ఎస్సారెస్పీ డివిజన్‌–1 విభాగంలో ఒక్క పోస్టు మాత్రమే కేటాయించింది. కానీ ఎస్సారెస్పీ డివిజన్‌–1లో వందల పోస్టుల కోసం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రచారం చేస్తూ ఉద్యోగులు ఇప్పిస్తామంటూ ఎస్సారెస్పీలో దందా షురూ చేశారు. అసలు విషయం తెలియక ఉద్యోగాల ఆశతో అనేక మంది నిరుద్యోగులు ఎస్సారెస్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతూ మధ్యవర్తుల ఉచ్చులో పడుతున్నారు.

ప్రాజెక్ట్‌ ఉన్నతాధికారులు సైతం ఇప్పటి వరకు లస్కర్‌ల నియామకంపై ఎలాంటి ప్రకటన ఇవ్వలేదు. కానీ దరఖాస్తు ఇస్తే మాత్రం కార్యాలయంలో స్వీకరిస్తున్నారు. అసలు ఏమి జరుగుతుందో తెలియక నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అవసరం ఉంది..

ఎస్సారెస్పీ డివిజన్‌–1 విభాగంలో పని చేసేందుకు కనీసం 30 మంది లష్కర్‌ల కొరత ఉంది. 30 మంది లష్కర్‌లను నియమించినా సరిపోని పరిస్థితి ఉంది. కానీ ఎస్సారెస్పీలో పదవీ విరమణలే తప్ప నూతన ఉద్యోగుల రాక లేదు. దీంతో ప్రాజెక్ట్‌ నుంచి అనేక సబ్‌ డివిజన్‌లు తరలిపోయి కళను కోల్పోయింది. ప్రస్తుతం తప్పుడు ప్రచారంతో కొందరు నిరుద్యోగుల నుంచి దండుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే లష్కర్‌ పోస్టుపై స్పష్టత ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్‌ చేస్తున్నారు.

అవుట్‌ సోర్సింగ్‌ ద్వారా..

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ డివిజన్‌–1లో లస్కర్‌ల కొరత తీవ్రంగా ఉంది. కానీ గత ప్రభుత్వం వీఆర్‌ఏల సర్దుబాటులో భాగంగా 13 మంది వీఆర్‌ఏలను లస్కర్లుగా నియమించింది. కానీ అందులో ఒక వీఆర్‌ఏ లస్కర్‌గా విధుల్లో చేరకపోవడంతో పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఆ పోస్టును అవుట్‌సోర్సింగ్‌ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం మంజూరు ఇచ్చింది.

మోసపోవద్దు

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ డివిజన్‌–1లో ఒక్క లష్కర్‌ పోస్టు మాత్రమే ప్రస్తుతం భర్తీ చేసే అవకాశం ఉంది. అనేక మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎవరికీ చిల్లి గవ్వ ఇవ్వాల్సిన పనిలేదు. సీఈ స్థాయిలో నియామకం ఉంటుంది. నిరుద్యోగులు ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దు.

– చక్రపాణి, ఈఈ , ఎస్సారెస్పీ

ఉన్న మొక్కను తీసేసి కొత్త మొక్కను నాటారు



ఎస్సీ హాస్టల్‌ ఆవరణలో మొక్కను తొలగిస్తున్న సిబ్బంది



అదే స్థలంలో అదనపు కలెక్టర్‌తో మొక్కను నాటిస్తున్న వార్డెన్‌

వర్నిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను అదనపు కలెక్టర్‌ అంకిత్‌ బుధవారం తనిఖీ చేసేందుకు రాగా వార్డెన్‌ అంజద్‌ అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. అదనపు కలెక్టర్‌తో మొక్కను నాటించేందుకు అప్పటికే అక్కడ ఉన్న మొక్కను తొలగించి అదే గుంతలో నాటించారు.

– వర్ని

గేదెలకు పచ్చిగడ్డితో మేలు



గేదెకు చికిత్స చేస్తున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్‌ మాజిద్‌

మాక్లూర్‌: పచ్చి గడ్డితోనే పశువుల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్‌ మాజిద్‌ అన్నారు. మండలంలోని గుంజ్లిలో బుధవారం స్థానిక పశువైద్యాధికారులు కిరణ్‌దేశ్‌ పాండే, ఉమా సహేర్‌ పర్యవేక్షణలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ నిర్వహించిన ఉచిత గర్భకోశవ్యాధి నివారణ చికిత్స శిబిరానికి మాజిద్‌ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పశువులకు సరైన ఆహారం అందిస్తే అంచనాకు మించి పాలు ఇవ్వగలుగుతాయన్నారు. అనంతరం 22 పశువులకు గర్భకోశవ్యాధి నివారణ చికిత్స, 5 గేదెలకు కృతిమ గర్భధారణ చేయడంతోపాటు 24 దూడలకు నట్టల నివారణమందు తాగించి 15 పశువులకు సాధారణ చికిత్స అందించారు. పశువైద్య సిబ్బంది టి వినిత, ఆర్‌ కల్యాణి, అహ్మద్‌పాషా, పి శ్రీకార్‌, శ్యామల, పుష్ప, గంగాధర్‌, మహేశ్వరి, సుధీర్‌, పశువుల పెంపకందారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



రుద్రూర్‌ కస్తూర్బా స్కూల్‌ స్టోర్‌లో సామగ్రిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌

రుద్రూర్‌: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, అంగడిబజార్‌ అంగన్‌వాడి కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, టాయిలెట్స్‌, పరిసరాలతోపాటు స్టోర్‌ రూములో నిల్వ ఉంచిన వంట సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న భోజనం నాణ్యత వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్‌ తారాబాయి, ఎంపీడీవో సురేశ్‌బాబు, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి శ్యామల ఉన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం సందర్శన

రుద్రూర్‌ కృషి విజ్ఞాన కేంద్రాన్ని అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ సందర్శించారు. కేంద్రం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను కేంద్రం కో ఆర్డినేటర్‌ అంజయ్య వివరించారు. పంటల సాగులో సేంద్రియ ఎరువుల ప్రాధాన్యతను వివరించడంతో పాటు రైతుల సమస్యలను తెలుసుకుంటున్నామని, చీడపీడల నివారణకు సలహాలు, సూచనలు అందిస్తున్నామన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్‌, శ్వేత తదితరులు ఉన్నారు.

రైతువేదిక తలుపు ధ్వంసం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్‌ రైతువేదిక భవనం తలుపును దుండగులు మంగళవారం రాత్రి ధ్వంసం చేసినట్లు ఏవో నర్సింలు తెలిపారు. కార్యాలయంలో ఉన్న రూ.4 లక్షల విలువైన వీడియో కాన్ఫరెన్స్‌ సెట్‌ సురక్షితంగా ఉందన్నారు.ఈ ఘటనపైపోలీసులకుఫిర్యాదుచేశామన్నారు.

అపూర్వ సమ్మేళనం



మాక్లూర్‌: మండలంలోని గుత్ప జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల 1996–97 బ్యాచ్‌ పదోతరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 27 సంవత్సరాల తరువాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఉద్యోగం పేరిట టోకరా

కామారెడ్డి క్రైం: అమెజాన్‌ కంపెనీలో ఉద్యోగం ఇస్తామని ఓ వ్యక్తికి రూ.3,850 లకు టోకరా వేశారు. పట్టణంలోని స్నేహపురి కాలనీకి చెందిన నజీరుద్దీన్‌ అనే వ్యక్తికి మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌ చేసి అమెజాన్‌ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. అందుకు విడతలవారీగా రూ.3,850 ఫోన్‌ పే ద్వారా వేయించుకున్నాడు. చార్జీల పేరుతో మళ్లీ, మళ్లీ డబ్బులు వేయాలని అవతలి వ్యక్తి చెప్పడంతో అనుమానం వచ్చిన నజీరుద్దీన్‌ బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం



మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బోధన్‌టౌన్‌(బోధన్‌): బాల్య వివాహాలను నిర్మూలించి, బాలికలకు బంగారు భవిష్యత్‌ను ఇద్దామని డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్‌ సమన్వయ కర్త స్వప్న పిలుపునిచ్చారు. మహిళాశిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆవరణలో ఉన్న ఉన్నత పాఠశాలలో 'బాల్య వివాహ్‌ విముక్త్‌ భారత్‌'పై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ర్యాలీ, మానవ హారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. బాల్యవివాహాల కారణంగా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ సీడీపీవో రాధిక, సూపర్‌ వైజర్లు ఆసియా, లక్ష్మి, హెచ్‌ఎం బాల్‌చందర్‌, అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, శ్యామల, కళావతి, జమున, రాణి, ఖనీస్‌, విద్యార్థినులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాన్ని ఎడ్యుకేషన్‌ హబ్‌గా తీర్చిదిద్దాలి

- రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో వక్తల డిమాండ్‌



కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రాన్ని ఎడ్యుకేషనల్‌ హబ్‌గా తీర్చిదిద్దాలని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. బుధవారం విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధిలో భాగంగా విద్యారంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. సౌత్‌ క్యాంపస్‌ను కామారెడ్డి జిల్లా యూనివర్సిటీగా మార్చాలని, అలాగే జిల్లా కేంద్రంలో ఇంజినీరింగ్‌, పాలిటెక్నిక్‌, ఐటీఐ, మెడికల్‌ నర్సింగ్‌, లా కాలేజ్‌, కేంద్రీయ విద్యాలయం, టీటీసీ, బీఈడీ, ఎంఈడీ, మహిళా డిగ్రీ కళాశాల, దోమకొండలో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. అలాగే మార్కెట్‌లో రైతుల నుంచి వసూలు చేస్తున్న తైబజార్‌ ఎత్తివేయాలని, గంజ్‌లో ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, పట్టణంలో మరో ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించాలని కోరారు. కామారెడ్డి జేఏసీ కన్వీనర్‌ జగన్నాథం, బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్‌ క్యాతం సిద్ధిరాములు, ఏపీటీఎఫ్‌ మాజీ రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాల్‌, మాజీ జెడ్పీటీసీ మల్లన్న, సాప శివరాం, గంగారాం, ఎల్‌ఎన్‌. ఆజాద్‌, ఎన్‌ఎస్‌యూఐ, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, జీవీఎస్‌ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్‌, అరుణ్‌, సతీష్‌, వినోద్‌, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌ పాల్గొన్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలుశిక్ష

రుద్రూర్‌: ద్విచక్ర వాహనాన్ని అతివేగం, అజాగ్రత్తగా నడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి న్యాయస్థానం బోధన్‌ కోర్టు అడిషనల్‌ జడ్జి శివసాయి ఏడాదిన్నర జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై సాయన్న బుధవారం తెలిపారు. 2016 జూలై 19 తేదీన త్రిశూల్‌ శంకర్‌ అనే వ్యక్తి బైక్‌పై వస్తుండగా సులేమాన్‌ నగర్‌ గ్రామానికి చెందిన షేక్‌ లతీఫ్‌ టీవీఎస్‌ ఎక్సెల్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో శంకర్‌ మృతి చెందాడని తెలిపారు. బాధితుల తరపున పబ్లిక్‌ ప్యాసిక్యూటర్‌ సీహెచ్‌ రాణి వాదనలు వినిపించినట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బాలికను ఈవ్‌ టీజింగ్‌ చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌ బుధవారం తెలిపారు. బాలికను సదరు యువకులు వేధించినట్లు ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



అజయ్‌కుమార్‌(ఫైల్‌)

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన యువకుడు దుర్మరణం చెందినట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ తెలిపారు. గజ్జల అజయ్‌ కుమార్‌(26) అనే యువకుడు సిరికొండ వైపు నుంచి మరిమడ్లకు వెళ్తుండగా తాటిపల్లి గ్రామంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడగా, తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సౌదీ అరేబియాలో కులాస్‌పూర్‌ వాసి..




కోర్వ మోహన్‌ (ఫైల్‌)

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని కులాస్‌పూర్‌ గ్రామానికి చెందిన కోర్వ మోహన్‌ (45) సౌదీ అరేబియాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి కోసం కోర్వ మోహన్‌ గత కొన్నేళ్లుగా గల్ఫ్‌, సౌదీ అరేబియాకు వెళ్లి వస్తున్నాడు. ప్రస్తుతం సౌదీలోని మున్సిపాలిటీ (బల్దియా)లో పని చేస్తున్న ఆయన ఆదివారం పని ప్రదేశంలో వర్షం కురుస్తుండటంతో మ్యాన్‌హోల్‌ సరి చేసేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సరోజ, కుమారుడు అరవింద్‌ ఉన్నాడు. మృతదేహాన్ని స్వ గ్రామానికి రప్పించేలా ఎమ్మెల్యే భూపతిరెడ్డి చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

కంటైనర్‌ ఢీకొని ఏఆర్‌ హెడ్‌ కానిస్టేబుల్‌..

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌ చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే పెట్రోలింగ్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ రాథోడ్‌ ప్రతాప్‌సింగ్‌(50) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మెడిసిన్‌ కోసం రాథోడ్‌ ప్రతాప్‌సింగ్‌ బుల్లెట్‌పై ఆర్మూర్‌వైపు వస్తుండగా జాతీయ రహదారి చౌరస్తా వద్ద హైదరాబాద్‌నుంచి నిర్మల్‌వైపు వెళ్తున్న కంటైనర్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రతాప్‌సింగ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. కంటైనర్‌ డ్రైవర్‌ పరారయ్యాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



ముత్తన్న(ఫైల్‌)

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఖతర్‌ దేశంలో 15 రోజుల క్రితం మృతి చెందిన ఆలూర్‌ మండలం రాంపూర్‌ గ్రామానికి చెందిన గంట చిన్న ముత్తన్న(56) మృతదేహం భారత రాయబార కార్యాలయం అధికారుల చొరవతో బుధవారం స్వగ్రామానికి చేరింది. ఖతర్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న ముత్తన్నకు పదిహేను రోజుల క్రితం యజమానితో గొడవ జరగడంతో అక్కడి నుంచి వెళ్లిపోయి స్నేహితుల వద్ద రెండు రోజులు ఆశ్రయం పొందాడు. రెండు రోజుల తర్వాత యజమాని దగ్గరకు వెళ్తున్నానని స్నేహితులకు చెప్పిన ముత్తన్న 13వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికే యజమాని ముత్తన్నకు సంబంధించిన ఖతర్‌ ఐడీని బ్లాక్‌ చేయించాడు. దీంతో మృతదేహాన్ని అక్కడే మార్చురీలో భద్రపరిచారు. తెలంగాణ గల్ఫ్‌ సమితి అధ్యక్షుడు మైదం మధు ఐసీబీఎఫ్‌ సెక్రెటరీ మహ్మద్‌ ఖుని, శంకర్‌గౌడ్‌, ప్రవాసీ భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నరసింహనాయుడి ప్రత్యేక చొరవ తీసుకుని మృతదేహాన్ని ఇండియాకు రప్పించారు. కుటుంబసభ్యులు బుధవారం సాయంత్రం ముత్తన్న అంత్యక్రియలు పూర్తి చేశారు.

చలి తీవ్రతను తట్టుకోలేక మృతి?



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నవీపేట: మండల కేంద్రం శివారులోని జీవన్‌ దాబా ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడికి 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, చలి తీవ్రతను తట్టుకోలేక మృతి చెంది ఉంటాడని ఎస్సై వినయ్‌ అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు రెడ్‌, బ్రౌన్‌, గ్రీన్‌ కలర్‌ లైన్స్‌ షర్ట్‌, ప్యాంట్‌ ధరించి ఉన్నాడన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

బాన్సువాడ రూరల్‌: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని సోమేశ్వర్‌ గ్రామానికి చెందిన ర్యాపని మల్లవ్వ (48) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె భర్త కిష్టయ్య బుధవారం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లవ్వ ఈనెల 25వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. బుధవారం స్థానిక చెరువులో ఆమె మృతదేహం లభ్యం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

రుద్రూర్‌: కోటగిరి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని పోతంగల్‌ గ్రామ శివారులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

నాగంపేట్‌ శివారులో..

బాల్కొండ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను నాగంపేట్‌ శివారులో ఆర్‌ఐ రాఘవేందర్‌ బుధవారం పట్టుకున్నారు. ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బస్సు ఎక్కుతుండగా ప్రమాదం

- మహిళకు తీవ్రగాయాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బస్సు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఓ మహిళ కిందపడి తీవ్రగాయాలపాలైంది. ఘటనకు సంబంధించిన గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన కంసవ్వ బుధవారం తాడ్వాయికి వచ్చింది. అనంతరం కామారెడ్డికి వెళ్లేందుకు తాడ్వాయి పాతబస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడింది. బస్సులో ప్రయాణికుల రద్దీ ఉండడంతో కిందపడిపోయిన కంసవ్వ కాళ్లపై నుంచి బస్సు వెనుక టైర్లు వెళ్లాయి. కంసవ్వ కుడికాలు నుజ్జునుజ్జుకాగా ఆమెను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆర్టీసీ బస్సును స్టేషన్‌కు తరలించారు.

నగలు, నగదు అప్పగింత

కామారెడ్డి టౌన్‌: తాడ్వాయిలో చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కంసవ్వను చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా, ఆమెకు సంబంధించిన నగలు, నగదును పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్షతగాత్రురాలి ఒంటిపై ఉన్న బంగారు గుండ్లు, పుస్తెలతాడు, చెవి రింగులతోపాటు నగదును ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్‌ కానిస్టేబుల్‌ లక్ష్మణ్‌ బాధితురాలి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కంసవ్వను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు రిఫర్‌ చేశారు.



అద్దె అడిగితే బెదిరించిన ఐదుగురిపై కేసు

కామారెడ్డి క్రైం: అద్దె డబ్బులు చెల్లించాలని అడిగితే బెదిరింపులకు పాల్పడిన ఐదుగురిపై కామారెడ్డి పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై బాల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్టేషన్‌ రోడ్డులో ఉన్న ఓ భవనాన్ని 11 నెలల అగ్రిమెంట్‌కు పట్టణానికి చెందిన వినోద్‌ శర్మ, ముజీబ్‌, శ్రీనివాస్‌, లక్ష్మణ్‌, పి.శ్రీనివాస్‌ కలిసి లీజుకు తీసుకుని జస్ట్‌ ఫర్‌ యూ పేరుతో దుకాణం నడుపుతున్నారు. అయితే వారు 8 నెలలుగా ఇంటి అద్దె చెల్లించడం లేదు. సికింద్రాబాద్‌లోని మహేంద్ర హిల్స్‌లో నివాసం ఉండే ఇంటి యజమాని రాజశేఖర్‌రెడ్డి.. అద్దె వసూలు చేయడానికి ఇటీవల కామారెడ్డికి వచ్చాడు. దుకాణంలోకి వెళ్లి అద్దె ఇవ్వాలని అడుగ్గా షాప్‌ నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులు కలిసి రాజశేఖర్‌రెడ్డిని అసభ్యకరంగా దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో రాజశేఖర్‌రెడ్డి పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యుత్‌ షార్ట్‌సర్క్యూట్‌తో మండల కేంద్రంలో రెండు ఇళ్లు దగ్ధమైనట్లు తహసీల్దార్‌ నరేందర్‌ తెలిపారు. మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గుండ బాలకిషన్‌, స్వామి అనే వ్యక్తులు కుటుంబ సభ్యులతో కలిసి తమ తమ ఇళ్లలో నిద్రిస్తున్న సమయంలో షార్ట్‌సర్క్యూట్‌ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో వారంతా ఇళ్ల నుంచి బయటికి పరుగులు తీశారు. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేయడంతోపాటు ఫైరింజన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. తన ఇంట్లోని బీరువా, దుస్తులు, వంట సామగ్రి, ఫ్రిజ్‌, కూలర్‌, ఫ్యాన్లు, కుర్చీలు, సోఫాలు దగ్ధమై రూ.4లక్షల నష్టం వాటిల్లినట్లు బాలకిషన్‌ తెలిపారు. అలాగే తన ఇంట్లోని బీరువా, వంట సామగ్రి, ఫ్రిజ్‌, ఫ్యాన్లు, కుర్చీలు, రూ.56,500 నగదు, తదితర వస్తువులు దగ్ధమై రూ.4లక్షల నష్టం వాటిల్లినట్లు గుండ స్వామి తెలిపారు. ఘటనాస్థలానికి తహసీల్దార్‌ నరేందర్‌ చేరుకొని వివరాలు సేకరించారు.

పాత ఇనుప సామాను దుకాణం..

భిక్కనూరు: మండల కేంద్రంలో పాత ఇనుప సామాను దుకాణం బుధవారం రాత్రి దగ్ధమైంది. పాత ఇనుప సామాను వ్యాపారం చేసే అశోక్‌ దుకాణానికి తాళం వేసి బయటికి వెళ్లిన మంటలు అంటుకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై సాయికుమార్‌ ఘటనాస్థలానికి చేరుకుని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.